క్లుప్తంగా

వలంటీర్ తొలగింపు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న గరక రాజేష్‌ను తొలగించినట్టు ఎంపీడీవో ఉమాసుందరి శనివారం తెలిపారు. టీడీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు అతనిపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీన్ని పరిశీలించి దర్యాప్తు చేయగా వాస్తవమని తేలడంతో రాజేష్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ముగిసిన ప్రచారం



ప్రచార వాహనానికి కట్టిన ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం

నందిగాం: కొద్దిరోజులుగా హోరెత్తిన ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. ప్రచార వాహనాలకు ఉన్న సౌండ్ సిస్టంలు, ఫ్లెక్సీలను తొలగించారు. పోలీసులు గ్రామాల్లో 144 సెక్షన్ విధించారు. ఎక్కువ మంది గుమిగూడకూడదని, స్థానికేతరులు ఉండరాదని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

మద్యం దుకాణాలకు సీళ్లు



నరసన్ననపేటలో మద్యం దుకాణానికి సీళ్లు వేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: పోలింగ్ దృష్ట్యా మద్యం దుకాణాలు మూతపడ్డాయి. నరసన్నపేటలోని ఒక బార్‌తో పాటు ఎనిమిది మద్యం దుకాణాలకు సెబ్ అధికారులు సీళ్లు వేశారు. ఈ నెల 14వ తేదీన మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పోలింగ్ నేపథ్యంలో పట్టణంలో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద శుభ్రంగా ఉండేలా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దు. రాజ్యాంగం కల్పించిన ఓటును వినియోగించుకోవడం మనందరి బాధ్యతని టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ప్రశాంత ఓటింగ్ కోసం 315 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. –టెక్కలి

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 271 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు
- 82 క్లిష్టమైన కేంద్రాల్లో ప్రత్యేక బలగాలతో బందోబస్తు
- ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
- 'సాక్షి'తో టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో నూరుల్ కమర్

ఇంటర్వ్యూ

సాక్షి: పోలింగ్ కోసం ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్‌ఓ: నియోజకవర్గంలోని టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో 315 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,36,327 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,17,816, మహిళలు 1,18,502 మంది, ఇతరులు తొమ్మిది మంది ఉన్నారు. ఉదయం 5.15 గంటలకు మాక్ పోల్‌తో పోలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తాం. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఆయా కేంద్రాల్లో పక్కా వసతులతో ఏర్పాట్లు చేశాం. ప్రతీ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ఆటోలను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

సాక్షి: నియోజకవర్గంలో క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయా?

ఆర్‌ఓ: 82 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తాం. సాధారణ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలు పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది.

సాక్షి: రిగ్గింగ్‌లకు ఆస్కారం లేకుండా తీసుకున్న చర్యలు?

ఆర్‌ఓ: ఓటర్లంతా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పక్కాగా ఏర్పాట్లు చేశాం. నియోజకవర్గంలో 271 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నాం. సబ్ కలెక్టర్, కలెక్టర్ కార్యాలయం, సీఈవో, ఈసీ తదితర అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రతీ కదలికను పర్యవేక్షిస్తారు.

సాక్షి: ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏమైనా ఏర్పాటు చేస్తున్నారా?

ఆర్‌ఓ: జీడిపేట, వంగర, సవరలింగుపురం తదితర గిరిజన గ్రామాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటితో పాటు కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రం పరిధిలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండడంతో అక్కడ పూర్తి స్థాయిలో మహిళా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం.

సాక్షి: హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఎలా జరిగింది?

ఆర్‌ఓ: టెక్కలి నియోజకవర్గంలో 24 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 3044 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2919 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

నరసన్నపేటలో సర్వం సిద్ధం

- సిద్ధమైన పోలింగ్ కేంద్రాలు
- డిగ్రీ కళాశాల కేంద్రంగా సామగ్రి పంపిణీ
- 189 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్



ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



సిద్ధమైన పోలింగ్ సామగ్రి

నరసన్నపేట: నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 290 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. 2,14,866 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి 600 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంట్లో ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, పది మంది ఎస్సైలు, మిగిలిన 580 మంది పోలీసులు వివిధ హోదాల్లో ఉన్న వారు బందోబస్తు నిర్వహిస్తారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 189 చోట్ల వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 95 కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ఈమేరకు అన్ని చర్యలు తీసుకున్నారు. 33 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించారు. 40 బస్సులతో పాటు మరో వంద వాహనాలను వినియోగిస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రం

పోలింగ్ సామిగ్రి పంపిణీ కోసం నరసన్నపేట డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏర్పాట్లపై ప్రత్యేక అధికారి బి.నగేష్‌తో పాటు ఆర్వో పరిశీలించారు. ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన సిబ్బంది తొందరగా ఫెసిలిటేషన్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సిబ్బందికి భోజన ఏర్పాట్లను ఫెసిలిటేషన్ కేంద్రంలోనే ఏర్పాటు చేసినట్టు వివరించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



నందిగాం: ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది



సారవకోట: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



టెక్కలి: ఆర్వో నూరుల్ కమర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సారవకోట: ఎంఎంఎస్, ఉపాధిహామీ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ద్విచక్ర వాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. సారవకోట నుంచి అలుదు వరకు ఎన్నికలలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరాజులు, ఎంఎంఎస్, ఉపాధిహామీ ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టెక్కలి: నీ ఓటు నీ భవిష్యత్.. ఓటు విలువ తెలుసుకో.. నీ భవిష్యత్‌ను మార్చుకో అనే నినాదంతో టెక్కలి పట్టణంలో ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి కోరారు. ఏసీ శ్రీరాములు, ఏపీఎం నారాయణరావు, ఏపీఓ హరిప్రసాద్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు.

నందిగాం: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో శివప్రసాద్ సూచించారు. నందిగాంలో ఓటర్లను అవగాహన కల్పించేందుకు వెలుగు ఏపీఎం జాంభవతి ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది, ఉపాధిహామీ, మండల పరిషత్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని.. దాన్ని వినియోగించుకొని భవిష్యత్‌తరాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఏపీఓ నాగరాజు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

జలుమూరు: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రతి శిష్టకరణ సామాజికవర్గానికి చెందిన వ్యక్తులంతా ఆలోచించి ఓటు వేయాలని శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ కోరారు. చల్లవానిపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్.ప్రభాకరరావు, సంఘం నాయకులు లోకేశ్వరరావు, మహేష్ ఉన్నారు.

పోస్టర్‌పై దర్యాప్తు ముమ్మరం

నరసన్నపేట: నరసన్నపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌ను కించపరుస్తూ, పలు ప్రశ్నలు సంధిస్తూ శనివారం ఉదయం వెలిచిన పోస్టర్లపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

అభ్యర్థి తరపున శాస్త్రి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆర్వో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు చూస్తున్న ఎంపీడీవో రామకృష్ణకు తగు సూచనలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అంటించిన పోస్టర్లను వెంటనే తొలగించారు.

పోస్టర్లను అంటించిన వారికి సంబంధించిన సీసీ ఫుటేజీని కూడా శాస్త్రి ఇచ్చారని ఆర్వో తెలిపారు. దీన్ని సీఐకి పంపించిన దర్యాప్తు చేయాలని ఆదేశించామని ఆర్వో పేర్కొన్నారు. పోస్టర్లను అంటించిన వారు నరసన్నపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలుగా భావిస్తున్నారు.

సీఎం జగన్ రుణం తీర్చుకోండి

- నరసన్నపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కిల్లాంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్



కోటబొమ్మాళిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రచార పర్వం

నరసన్నపేట: ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలని నరసన్నపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ కోరారు. మండలం కిల్లాంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను అందజేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రావాలని దీవించాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కిల్లాం కూడలిలో మాట్లాడుతూ .. గడిచిన 59 నెలల్లో అర్హత గల ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ పథకాలు మళ్లీ ఇలానే అమలు కావాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండాలని అన్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని కోరారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజా, ఎంపీటీసీ సభ్యుడు యాళ్ల అప్పలనాయుడుపాల్గొన్నారు.

జోరుగా ప్రచారం



సారవకోట: బుడితిలో ప్రచారం చేస్తున్న నాయకులు



గోపాలపురంలో వేతనదారులతో మాట్లాడుతున్న నాయకులు

సారవకోట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో ప్రచారం చేశారు. సచివాలయ జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్ బుడితిలో మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ, శ్రీను ఉన్నారు. అలాగే గోపాలపురం, గుమ్మపాడు గ్రామాలలోని ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోట కొత్తూరు సర్పంచ్ బాడాన కృష్ణారావు, నాయకులు రమణ, రామయ్యలు ప్రచారం చేశారు.

ఆశీర్వదించండి:దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మీ చల్లని చేతులతో ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్ గెలిపించాలని టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. పాలతలగాం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక సర్పంచ్ నెక్కట్ల అప్పన్న, ఎంపీటీసీ సభ్యుడు అట్టాడ అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్, అప్పలనాయుడు, రోహిణి ఉన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి, సీతన్నపేట, ఉప్పరిపేట, బంజీరుపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పొట్నూరు బుజ్జి, బెహరా కృష్ణారావు, ఇర్రి చిరంజీవి ఉన్నారు.

కోటబొమ్మాళిలో బైక్‌ర్యాలీ

కోటబొమ్మాళి: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌లకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం కోటబొమ్మాళి నుంచి ప్రకాష్‌నగర్‌కాలనీ, కొత్తపేట, మంచాలపేట, సీతన్నపేట, ఉప్పరపేట గ్రామాల్లో ర్యాలీ సాగింది.



కోటబొమ్మాళి: బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సంక్షేమానికి ఓటేయండి

టెక్కలి: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఐదేళ్లలో ప్రజలకు చేకూరిన సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. బొప్పాయిపురం, అక్కవరం తదితర పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతీఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు జి.గురునాథ్‌యాదవ్, కె.సూర్యం, కోదండ, చంద్రరావు ఉన్నారు.



టెక్కలి: బొప్పాయిపురంలో ప్రచారం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలకు తిలోదకాలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఆశతో టీడీపీ నాయకులు ఎన్నికల నిబంధనలను లెక్కచేయకుండా ఓటర్లను పలు రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా యువ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు యువతకు విలువైన క్రీడా సామాగ్రిని తాయిలాలుగా ఎర వేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో యువతకు క్రీడా సామాగ్రి రూపంలో తాయిలాలు అందించి ఎన్నికల నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు సమాచారం. అలాగే మరి కొన్ని గ్రామాల్లో ఒక్కొక్క ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు చొప్పున ఓటర్లకు బహిరంగానే పంపిణీ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు.

'ఓటుహక్కు వినియోగించుకోవాలి'

సోంపేట: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఏపీఎం రమణమ్మ సూచించారు. సీడాప్ ఆధ్వర్యంలో సోంపేట పట్టణం, మండలంలో ఓటుహక్కుపై అవగాహన కలిస్తూ శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ఓటుతో సమాజంలో మార్పు తీసుకురావొచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రమీల, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రలోభాలకు గురి కావొద్దు'



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నైతిక విలువతో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎ.రఘుపతి సూచించారు. మందస మండల కేంద్రంలో శనివారం సెర్ప్ ఆధ్వర్యంలో అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నైతిక విలువలు పాటిద్దాం, నిజాయితీగా ఓటు వేద్దామని నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం జి.ప్రసాదరావు, ఏపీవో హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు సీళ్లు



నరసన్నపేటలో మద్యం దుకాణానికి సీళ్లు వేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: పోలింగ్ దృష్ట్యా మద్యం దుకాణాలు మూతపడ్డాయి. నరసన్నపేటలోని ఒక బార్‌తో పాటు ఎనిమిది మద్యం దుకాణాలకు సెబ్ అధికారులు సీళ్లు వేశారు. ఈ నెల 14వ తేదీన మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.

దేవునల్తాడలో భారీర్యాలీ



దేవునల్తాడలో ర్యాలీ చేపడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ శనివారం నిర్వహించింది. మంత్రి సోదరుడు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ సీదిరి చిరంజీవి ఆధ్వర్యంలో సర్పంచ్ తెరిపిల్లి వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు సొదాల వెంకన్న ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్వగ్రామంలో మహిళలు, మత్స్యకారులు బ్రహ్మరథం పట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజును, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ఈవీఎం నమూనాతో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఎలా ఓటు వేయాలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గాలి శేషగిరినాయుడు, లక్ష్మణరావు, ఉమారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

అల్లుడి ఆగడాలు.. ప్రజల అగచాట్లు..!



దోకి హరీష్ మరణంపై నిరసన తెలుపుతున్న ప్రజలు(ఫైల్)

- ఎన్నికల సమయంలో మరోసారి తెరపైకి శివాజీ అల్లుడు
- నాటి అరాచకాలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- అధికారంలోకి వస్తే ఇబ్బందులు తప్పవని ఆందోళన

కాశీబుగ్గ: ప్రశాంతతకు మారుపేరైన పలాసలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అశాంతి నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశం జిల్లా కారంచేడు నుంచి గౌతు శివాజీ ఇంటికి అల్లుడుగా వచ్చిన గౌతు శిరీష భర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి అరాచకాలు పెరుగుతాయని గత ప్రభుత్వంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో అల్లుడు చేసిన ఆగడాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో మెదులుతూనే ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే...

నువ్వలరేవులో కరపత్రాల కలకలం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు కమీషన్లు దండుకునేవారు. ముఖ్యంగా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో వేలాది రూపాయలు దండుకున్నారు. అయితే వీటిలో కొంతవాట వెంకన్న చౌదరికి ముట్టేదని వినికిడి. అక్కుపల్లి, మోట్టూరు గ్రామాల్లో జన్మభూమి కమిటీలు పథకానికి ఒక రేటు పెట్టి ప్రజల నుంచి వసూలు చేసేవారు. దీంతో వీరి ఆగడాలను భరించలేక 2018లో నువ్వలరేవు గ్రామస్తులు ఒక గోడ పత్రికను విడుదల చేసి నాయకులు బండారాన్ని బయటపెట్టారు.

ప్రాణభయంతో వైశ్య కుటుంబం

అప్పట్లో శివాజీ అల్లుడు, కాశీబుగ్గ, సోంపేట పోలీసు అధికారుల వలన తమకు ప్రాణ భయం ఉందని ఒక వైశ్య కుటుంబం కరపత్రాలు విడుదల చేసింది. తమకు ఏం జరిగినా వెంకన్న చౌదరిదే పూర్తి బాధ్యత అని రాసిన గోడ పత్రికలు కలకలం రేపాయి.

దోకి హరీష్ మరణ ఉదంతం

కాశీబుగ్గలోని ఒక స్వీట్ షాపులో చేస్తున్నటువంటి దోకి హరీష్ అనే వైశ్య కుటుంబానికి చెందిన బ్రాహ్మణతర్లా యువకుడిపై టీడీపీకి చెందిన కౌన్సిలర్ దాడిచేసి మరణానికి కారకుడయ్యాడు. ఈ ఉదంతంపై కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా ప్రజలంతా ఏకమై తీవ్రస్థాయిలో ఖండించారు. ఈ విషయం రాష్ట్రస్థాయిలో సంచలనంగా మారింది. అనంతరం అరెస్టైన కౌన్సిలర్‌ను నెల రోజుల్లోనే ఎమ్మెల్యే శివాజీ బయటకు తీసుకువచ్చారంటే హంతకులను ఎలా వెంటేసుకొని తిరిగారో అర్థం చేసుకోవచ్చు.



నువ్వలరేవులో కరపత్రాలు(ఫైల్)



గౌతు శిరీష భర్త వలన ప్రాణభయం ఉందని పలాసలో అంటించిన గోడ పత్రికలు(ఫైల్)

తవ్వేకొద్దీ బయటపడుతున్న లీలలు

- 2019లో అప్పటి ఎన్నికల అధికారి అనితపై చిందులు వేయడం, మందస మండల పరిధిలో తనిఖీలు చేస్తున్న అధికారులకు ఇబ్బందులు పెట్టడంతో ఫిర్యాదు చేయగా కేసులు నమోదైన ఘటనలు ఉన్నాయి.
- పలాస నియోజకవర్గంలో చినబడం పెట్రోల్ బంకును వివాదంలోకి తీసుకెళ్లి, అక్కడి వ్యాపారి బంకు వదిలేసేటట్లు చేశారు. ఇటీవల వారం రోజులు క్రితం బంకు ఆశచూపి తిరిగి టీడీపీలోకి తీసుకెళ్లిపోయారు.
- కాశీబుగ్గలో వృద్ధ వైశ్య దంపతులను ఆస్తి విషయంలో భయపెట్టారు. దీంతో ఆ వృద్ధ దంపతులు అప్పటి కాశీబుగ్గ సీఐ కె.అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా దాడి తప్పలేదు.
- పలాస మండలానికి చెందిన ఒక తహసీల్దార్ తమకు అనుకూలంగా పనిచేయలేదని అవమానపరిచారు.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాల్లో జీడిపప్పు ప్యాకెట్‌కు రూ.10 ట్యాక్స్ వసూలు చేసేవారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, నియోజకవర్గంలో అనేక ప్రాంతాలలో చెరువులు, గెడ్డలు, వాగులు, వంకలు, కొండలను అక్రమించారు. దీంతో టీడీపీ అధికారంలోకి వస్తే అల్లుడి ఆగడాలకు మరలా అడ్డూ అదుపు లేకుండా పోతుందని భయపడుతున్నారు.

అవకాశమివ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా



ఇచ్ఛాపురం: పురుషోత్తపురంలో ప్రచారం చేస్తున్న పిరియా విజయ

- ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3 వార్డుల్లో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని గుర్తుంచుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గత ఐదేళ్లలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లి, వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, పార్టీ నేతలు చాట్ల తిరుపతి, బొండాడ మహేష్, కొణతాల రామ్మూర్తి, సాలిన మామయ్య, కృష్ణారావుపాత్రో తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు కోరారు. మండలంలోని బారువ మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల బతుకుల్లో మార్పు తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ అధ్యక్షుడు బుద్దాన శ్రీకృష్ణ, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, సర్పంచ్ యర్ర రజనీ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: విజయకు హారతులిస్తున్న మహిళలు



సోంపేట: ప్రజలకు అభివాదం చేస్తున్న పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ కోరారు. మండలంలోని బాలకృష్ణాపురం, బుడ్డేపుపేటలో పర్యటిస్తూ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. మహిళాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగనన్నకు మద్దతు పలకాలని కోరారు.

• గుడ్ మార్నింగ్ మండపల్లి



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లిలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర చేసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, శనివారం ఉదయం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులతో కలిసి కాఫీ తాగుతూ మహిళలను ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టో నవరత్నాలు ప్లస్‌ను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఎంపీటీసీ సభ్యురాలు పిట్ట హేమలత, నాయకులు పిట్ట మామయ్యరెడ్డి, కాళ్ల నారాయణ, బదకల మోహన్‌దాస్, కాళ్ల సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయమే ధ్యేయంగా..!



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో విజయమే ధ్యేయంగా జోరుగా ఎన్నికల ప్రచారాలు సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులంతా ప్రతి ఇంటికీ వెళ్లి గత ఐదేళ్లలో జరిగిన మేలును తెలియజేస్తున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు వివరిస్తూ, మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నర్తు నరేంద్ర యాదవ్



కంచిలి: ఎస్ఆర్‌సీపురంలో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కంచిలి: కొన్నాయిపుట్టుగలో అవగాహన కల్పిస్తున్న యువకులు

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



అప్పలరాజుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలో అంబుగాం పంచాయతీలోని 18 గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో 60 ఏళ్లలో జరగని అభివృద్ధి, ఐదేళ్లలో చేసి చూపించానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ పేదింటికి వివిధ పథకాల ద్వారా మేలు జరిగిందని తెలియజేశారు. ఒక్కో పంచాయతీకి జనాభా ఆధారంగా సుమారు రూ.24.38 కోట్లు అందించామని పేర్కొన్నారు. ఈసారి సాధించే విజయంతో నియోజకవర్గంలో మరోసారి గౌతు, యార్లగడ్డ కుటుంబాల పేర్లు వినిపించకూడదన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

• ముమ్మరంగా శ్రీదేవి ప్రచారం



కాశీబుగ్గ: మున్సిపాలిటీలో పాదయాత్ర చేస్తున్న శ్రీదేవి

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో మంత్రి సీదిరి అప్పలరాజు సతీమణి, సీదిరి శ్రీదేవి ముమ్మరంగా శనివారం ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా పలాస నుంచి కాశీబుగ్గ వరకు పాదయాత్ర చేస్తూ అందరికీ అభివాదం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా సీదిరి అప్పలరాజును, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని తర్లాకోట, రెంటికోట గ్రామాల్లో సీదిరి శ్రీదేవి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా ప్రచారం చేసి మహిళా ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనరు దువ్వాడ రవి, సర్పంచ్‌లు శాసనపురి తిరుమలరావు, దువ్వాడ వామాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 13 నుంచి సింధు పోలమ్మ ఉత్సవాలు

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామదేవత సింధు పోలమ్మ నవరాత్రి మహోత్సవాలు ఈనెల 13వ తేదీ సోమవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈనెల 21వ తేదీ మంగళవారం వరకు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు అమ్మవారిని గ్రామపుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేపడతారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



ర్యాలీ చేపడుతున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని వెలుగు ఏపీఎం జి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఓటుహక్కుపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఓటే నీ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుందని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో పి.కేశవరావు, సీసీ ఐ.ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.